అభిరాం, వరప్రసాదం తప్ప మిగతావాళ్ళందరూ విస్తుపోయారు జరిగిన సంఘటన చూసి.

ఇంతలో మళ్ళీ చీఫ్‌ని వెంటపెట్టుకుని అక్కడ ప్రత్యక్షమయ్యాడు డాక్టర్.

అందరూ చూస్తుండగా మహదేవ్‌ని మళ్ళీ స్కాన్‌చేసి కంప్యూటర్ స్క్రీన్‌మీద దృశ్యం చూసి కొయ్యబారిపోయాడు చీఫ్.

"యు ఆర్ రైట్ డాక్టర్" అన్నాడతను.

చీఫ్‌తోపాటు అక్కడున్న ప్రతిఒక్కరూ తిరుపతివంక ఆశ్చర్యంగా చూశారు. అతను మాత్రం మహదేవ్ వంకే చూస్తున్నాడు.

'ఇతని ముఖం ఇప్పుడు ప్రసన్నంగా మారిపోయింది. ఈ ప్రసన్నత ఏమిటో, ఎందుకో అతనికి తెలుసు. క్షుద్రోపాసకుడికి మంత్రశక్తివల్ల ప్రేరేపింపబడిన అధిష్టాన దేవత ఆడిఆడి అలసిపోయిన బాలుడిలా ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటోంది.

మళ్ళీ మరో అధిష్టానదేవత ప్రేరేపించబడి మరొక రకమైన శారీరక చిత్రహింసకు గురవుతాడు మహదేవ్. అది చెయ్యి కావచ్చు ..... మరొకటి కావచ్చు ..... సప్తధాతువుల్లో ఏదో ఒకటి! అన్నీ నరకాన్ని చవిచూసేవే ..... !

ఆ సమయంలో అక్కడ సూదిపడితే విన్పించేంత నిశ్శబ్దం అలుముకుంది. "ఎవరితను? ఎలా చెప్పగలిగాడు మహదేవ్‌కి ఆపరేషన్ అవసరం లేదని?" తిరుపతినే చూస్తూ అనుకోసాగాడు చీఫ్.

మహదేవ్‌ని మళ్ళీ అతని గదికి తరలించారు.

అభిరాం, వరప్రసాదం, తిరుపతి అతని గదివైపు సాగిపోయారు.

ప్రశాంతంగా ..... నిద్రపోతున్నట్లున్నాడు మహదేవ్. ఎవరూ మాట్లాడటంలేదు. ఇంతలో గదితలుపు తెరుచుకున్న శబ్దం .....

వెనుదిరిగి చూశారు అక్కడున్న ముగ్గురూ!

చీఫ్, డాక్టర్ మెల్లగా వస్తున్నారు. అభిరాం, వరప్రసాదం కుర్చీల్లోంచి మహదేవ్ కాళ్ళదగ్గర బెడ్‌పై కూర్చుని వాళ్ళిద్దరికీ తమ సీట్లు ఇచ్చేశారు. అక్కడ మరిక కుర్చీలు లేవు.

"మిస్టర్! మీరెలా చెప్పగలిగారు మహదేవ్‌కి ఆపరేషన్ అనవసరం లేదని?" కూర్చుంటూ అడిగాడు చీఫ్.

తన కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు తిరుపతి.

'పూర్తిగా తెలిసినవాడూ, అస్సలేమీ తెలియనివాడూ మామూలుగానే వుంటారు. అంతో యింతో తెలిసినవాడే ప్రపంచంలో తనంత గొప్పవాడెవడూ లేడని అనుకుంటాడు. డాక్టర్లు ఆ కోవకే చెందుతారు. వీళ్ళకి ఏం చెప్పి తను తప్పించుకోవాలిప్పుడు? తప్పించుకోకపోతే వీళ్ళతో అనవసరమైన వాదాలూ, వివాదాలూను ..... ' అనుకున్నాడతను.

తిరుపతి ఏం సమాధానం చెబుతాడని ఎదురుచూడసాగారు అభిరాం, వరప్రసాదం.

అతని మౌనాన్ని భరించలేనట్లు కుర్చీలలో అసహనంగా కదిలాడు డాక్టర్.

చీఫ్ కళ్ళుమాత్రం తళుక్కుమని మెరుస్తూ-- తిరుపతిచెప్పే సమాధానంకోసం ఆత్రపడుతున్నాయి.

అభిరాం, వరప్రసాదం కేసి చూశాడు తిరుపతి. అభిరాం మౌనంగా వుండిపోయాడు. వరప్రసాదం మాత్రం "చెప్పండి మీ శక్తేమిటో?" అన్నట్లు చూశాడు.

ఇక తప్పదనుకుని చెప్పసాగాడు తిరుపతి.

"యోగం ద్వారా సాధ్యంకానిది ఏదీలేదు ఈ అనంతవిశ్వంలో. ఆది నుంచి అంతం ..... అంతంనుంచి ఆరంభం! ఇదే సృష్టికర్త లీలావిలాసం. ఆ లీలావిలాసాన్ని అవలీలగా దర్శించగలవాడు యోగి. యోగంద్వారా మలినమైన నవరంధ్రాలూ శుద్ధిచేయబడి క్రమంగా ఒక్కోమెట్టూ పైకి పోతాడు యోగి.

తదనంతరం ఋషిత్వం సిద్ధించి భగవంతుడు ప్రసరించే వెలుగులో ఒక వెలుగుగా రూపాంతం చెందుతాడు. జన్మలులేని ఆనందమయి జీవితాన్ని పొందుతాడు. ఇదే కోరుకుంటారు యోగులందరూ.

కానీ అందరికీ అంతటి మహర్దశ రాదు. యోగులందరూ సరిసమానులు కారు.

పిండికొద్దీ రొట్టె అన్నట్టు ఎవరి సాధనబట్టి వారికన్ని శక్తులు లభిస్తాయి. సాధారణ మానవుడు ఐశ్వర్యమంటే ధనరాశులూ, ఇళ్ళూ, భూములు, వాహనాలు వగైరా అనుకుంటాడు. దానికోసం ఎన్నో నేరాలు, ఘోరలు, పాపాలు చేస్తాడు.

ఎంత ఎక్కువకాలం జీవించినా మానవుడి జీవితం -- మరణాంతర జీవితంలో పోల్చుకుంటే ఒక్క వంతుకి కూడా రాదు. యిది తెలియని మానవుడు పాపాలు చేసి సంతోషం అనుభవిస్తాడు. కానీ మరణం తర్వాత జీవితం అతి సుదీర్ఘమయినది. పరిమితకాల మానవ జీవితంకోసం తపించే మనిషి, మరణించాక దానికంటే ఎన్నోరెట్లు ఎక్కువగల మరణాంతర జీవితం కోసం ఒక్క మంచి పనీ చేయడు.

యోగి అయినవాడు ఈ సత్యం తెలుసుకునే మానవజీవితం కేవలం సాధనకే వుపయోగించి, తరువాత జీవితాన్ని ఆనందమయం చేసుకుంటాడు. సాధన చేయగా చేయగా యోగికి ఒక్కొక్క శక్తీ అలవడుతూ వుంటుంది.

నేను ఇరవై ఏళ్ళుగా యోగం చేస్తున్నాను. అదికూడా నాగరిక ప్రపంచంతో అనుబంధాన్ని తెంపుకోకుండా, ప్రేమపాశాలు వదలకుండాను. అందువల్లే నాకు కొన్ని పరిమితమయిన శక్తులే లభించాయి. ఆ కారణంగానే చెప్పగలిగాను ఆపరేషన్ అవసరంలేదని."

అతను చెప్పటం అయిపోయినా ఛీఫ్కానీ, డాక్టార్ కానీ ఈ లోకంలోకి రాలేనట్టు- ఏదో ట్రాన్స్‌లో వున్నట్టూ బొమ్మల్లా వుండిపోయారు.

వారిని చూసిన అభిరాం, వరప్రసాదం ఆశ్చర్యపోయారు. వారిద్దర్నీ ఈ లోకంలోకి

తీసుకురావటానికన్నట్టు చిన్నగా దగ్గాడు తిరుపతి. అప్పుడు కదిలాయి ఛీఫ్ డాక్టర్ల శరీరాలు చైతన్యం వచ్చినట్లు.

"మీరు ..... మీరు చెబుతున్నది నిజమేనా?" చాలాసేపటి తర్వాత తేరుకున్న చీఫ్ అన్నాడు.

"ఇందులో అబద్ధం చెప్పవలసిన అవసరం ఏముంది నాకు?" తిరిగి అతన్నే ప్రశ్నించాడు తిరుపతి.

"కానీ సైన్స్ నమ్మదే" అన్నాడతను.

"నిజమే! ప్రతిదానికీ శాస్త్రీయాధారాలంటూ వుండాలి. అలాగే భగవంతుడూ, స్వర్గం-నరకం, ఆత్మలనేవి కూడా వుంటే, వాటి ఉనికిని తెలియచెప్పాలంటే భూకంపనాలని రికార్డ్‌చేసే రెక్టర్‌స్కేల్,సిస్మోగ్రాఫ్, మనిషి శరీరంలో ఉష్ణాన్ని తెలియచెప్పే ధర్మామీటర్, గుండె కొట్టుకునే వేగాన్ని తెలియచెప్పే స్టెతస్కోప్, ఎక్కడో వున్న మనిషి మాటల్ని అందుకుని మనకందచేసే టెలిఫోన్ వంటి పరికరాలుండాలి.

భగవంతుడి ఉనికిని మనకు తెలియచెప్పే పరికరం మనలోనే వుంది. అదేమిటో తెలుసా?" అంటూ ప్రశ్నించాడు తిరుపతి.

"ఏమిటది?" చీఫ్, డాక్టర్స్ యిద్దరూ ఒకేసారి అన్నారు.

* * * * *

"అభిరాంగారున్నారా?" నా పేరు మనస్విని" అందామె.

"లేదు. ఏదో అర్జంటు పనుందని చెప్పి ఇంటికి రాకుండానే వెళ్ళిపోయాడు. యింతకీ నువ్వెవరమ్మా?" అట్నుంచి ఓ స్త్రీ మాటలు వినిపించాయి.

"నేను అభిరాంగారి ఆఫీసులోనే పనిచేస్తున్నాను. మా తాతయ్యకి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. అందుకని రేపు ఆఫీసుకి రానని చెబుతారా?" తను అభిరాం ఫ్రెండ్ మహదేవ్ ప్రేయసినని చెప్పలేక అలా అందామె.

"అయ్యో! ఇంత రాత్రివేళ ఆ విషయం చెప్పాలా? ఒకరోజు కాకపోతే రెండురోజులు సెలవు తీసుకోమ్మా. ఆ విషయం నేను చెబుతాలే వాడికి ..... "

"అలాగేనండి. యింతకీ మీరు ..... "

"నేను అభిరాం అమ్మమ్మని. నా పేరు సుమతమ్మ."

"నమస్కారమండి. మర్చిపోకండి ..... నా పేరు మనస్విని! మనస్విని ఫోన్ చేసిందని చెప్పండి వుంటాను."

"అలాగే" అన్నది సుమతమ్మ.

"తాతయ్యకి ఒంట్లో బాగులేదని ..... అందుకని రేపు తను ఆఫీసుకి రాలేనన్న సంగతి ఓ ఆడపిల్ల ..... అదీ అర్థరాత్రి తన బాస్ ఇంటికి ఫోన్ చేయడం! యింతవరకూ నేనెక్కడా చూడలేదు, ఎప్పుడూ వినలేదు. రిసీవర్ క్రెడిల్‌చేసి దేనికోసమో వెదుక్కుంటున్న మనస్వినిని

అయోమయంగా చూస్తూ అనుకున్నాడు టెలిఫోన్ బూత్‌లోని యువకుడు.

"క్యా హువా?" మనస్విని పడుతున్న అవస్థ గమనించి అడిగాడు గూర్ఖా.

"మనీపర్స్ బూల్‌గయీ మై" అందామె.

"ఫికర్‌మత్‌కరోఁ ..... మై దేతా" అంటూ జేబులోంచి డబ్బులు తీసిడిచ్చాడతను.

మనస్విని గుండెల్లోని ఆవేదన కన్నీళ్ళ రూపంలో బయటికొచ్చేస్తోంది. అభిరాం యింట్లోలేడు. మహదేవ్ సంగతేం తెలియలేదు. 'ఖచ్చితంగా అతనికేదో జరిగింది' అనుకుందామె. గూర్ఖా కదిలాడు మనస్వినితో పాటు.

వాళ్ళిద్దరూ కనిపించిన మేర అలా చూస్తుండిపోయాడు బూత్‌లోని యువకుడు. 'పాపం! తాతయ్యంటే చాలా అభిమానంలా వుంది' అనుకున్నాడతను మనస్విని కన్నీళ్ళకి అర్థం తెలియక.

* * * * *

"మన మనస్సు!" బదులిచ్చాడు తిరుపతి.

ఇంకా ఏదో చెబుతాడనుకున్న ఆ యిద్దరూ తేలిగ్గా అతని మాటల్ని కొట్టిపడేశాడు.

"మనస్సు, అంతరాత్మ, దెయ్యాలూ, భూతాలు ఇవన్నీ ట్రాష్. మనిషి విచ్చలవిడిగా ప్రవర్తించి పాడైపోకూడదన్న వుద్ధేశ్యంతో చచ్చాక పాపులు చేరేది నరకానికేనని, అక్కడ శిక్షలు భయంకరంగా వుంటాయని మనవాళ్ళు సృష్టించిన పదాల గారడీ.

మోసాలు, పాపాలు చేస్తే భగవంతుడు గమనిస్తుంటాడని ఒక భయాన్ని అతి తెలివిగా ప్రజల్లోకి ఇంజెక్ట్‌చేశారు. దేవుడు, స్వర్గం, నరకం అన్న పదాలు హిందూ మత సనాతనులు దయ్యాలు, భూతాలు, క్షుద్రశక్తులు వంటి పదాల్ని తాంత్రికులమని చెప్పుకునే సెమీ క్రాక్డ్‌ఫెలోస్ సృష్టించారు.

ఈ రెండు వర్గాలూ తమ స్వప్రయోజనాలకోసం చేసిన పనిది. భగవంతుడున్నాడని, అతడు సర్వాంతర్యామీ అనీ, పాపపుణ్యాలు పరిశీలించి శిక్షలు వేస్తాడని, అందుకని నివారణోపాయం తాము చెబుతామని దానికై సంభావనం వగైరాలంటూ మొదటివర్గం అమాయక ప్రజల్ని తప్పుదోవ పట్టించింది.

రెండోవర్గంలోని వారు- తమని చూస్తే దెయ్యాలు, భూతాలు వణుకుతాయని, మంత్రం-తంత్రంవంటి వాటి ద్వారా మనిషిని బ్రతికించటం తమకి చాలా సులువని ప్రచారం చేసుకుని ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి తమ పబ్బం గడుపుకుంటారు.

ఈ రెండువర్గాలూ మానవుడిని అతనెంత ఎత్తుకి ఎదిగినా కూడా ఏదో ఒక రకంగా శాస్తిస్తూనే వున్నాయి. దానికి ఉదాహరణే మీరు.

మీలో ఎంతో తెలివీ, వాక్పటిమా వున్నాయి. కానీ ఏం లాభం? యోగం, ధ్యాన్యం, దేవుడు, దయ్యమూ వంటి పదాలు మీరూ వాడుతున్నారు. అదీ మనదేశం చేసుకున్న దౌర్భాగ్యం" విసుగ్గా అన్నాడు ఛీఫ్.

అతని మాటలతో ఏకీభవిస్తున్నట్లు చిన్నగా తలూపాడు డాక్టర్.

తిరుపతి చిన్నగా నవ్వి అన్నాడు.

"చాలా బాగా చెప్పారు చీఫ్! ఒకరకంగా మీ వాదనలో కూడా బలం వుంది. నాదొక చిన్న డౌట్."

"ఏమిటది?" చీఫ్ కంఠంలో తిరుపతి తన వాక్యాన్ని మెచ్చుకోవడంతో గర్వం తొణికిసలాడింది.

"ఏంలేదు ..... మహదేవ్‌ని మొదటిసారి స్కానింగ్ చేసినప్పుడు కనిపించిన 'సర్వైకల్ రిబ్' తరువాత ఎందుకు కనిపించలేదు?"

"అది ..... అది ..... లక్ష కేసుల్లో ఒక కేసు అలా జరగడానికి అవకాశం వుందని ఇంగ్లీషు వైద్యశాస్త్రం ఘోషిస్తోంది" తడబడి సరిదిద్దుకుని బదులిచ్చాడతను.

"దానికి కారణమేమిటి?"

"ఏముంది? సింపుల్ ..... మనిషి ఎముకలు కాల్షియం, భాస్వరం, కార్బనేట్ అనే పదార్థాలతో తయారవుతాయి. యిక స్కానింగ్ తీసేటప్పుడు X- రే, గామా, ఆల్ట్రా వైలెట్ కిరణాలు మనిషి శరీరంలోంచి ఎముకలపై పడి ఆ ఎముకని కరిగించేసి వుంటాయి.

దీనిక్కారణం చిన్నపిల్లల ఎముకలా అది వుద్భవించటం యింకా మొదటి దశలోనే వుంది కాబట్టి.

"మంచిది! మరి డాక్టర్ 'సర్వైకల్‌రిబ్'కీ ఆపరేషన్ మినహా మరో మార్గం లేదని అన్నారు. మీరు చెప్పినట్లు X-రే, గామా, ఆల్ట్రా వైలెట్ కిరణాలతో మనిషి శరీరంలో పెరిగే ఎగ్‌స్ట్రా ఎముకల్ని కరిగించే వీలున్నప్పుడు ఆపరేషనే చెయ్యాలని ఎందుకన్నారు?" నిలదీస్తున్నట్టు అడిగాడు తిరుపతి.

ఆ ప్రశ్నతో పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టు ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరైపోయాడు చీఫ్!

"మీరు సమాధానం చెప్పలేరని నాకు తెలుసు. ఇప్పుడు నేను చెప్పే విషయాలు శ్రద్ధగా వినండి. మీ అనుమానాలు, కుశ్శంకలూ అన్నీ తీరిపోతాయి.

మనిషి శరీరంలో వుండి బయటకు కనిపించిన షట్ చక్రాలను మీరంటున్న సైన్స్ ద్వారానే కంప్యూటర్ తెరమీద చూపించే విధానాన్ని కనుక్కున్న గొప్ప వ్యక్తి మోతోయామా.